

# అదోరకం ముచ్చట

"చిత్రంగా ఉందే....ఒక్క నిముషం ఉండండి. కోటు జేబులో ఉందేమో చూస్తాను" అన్నాడు అప్పారావు తొట్రుపడుతూ.

"అబ్బే తొందరేంలేదు. తాపీగా చూడండి" అన్నాడు టిక్కెట్టు కలెక్టరు—ఖాళీగా ఉన్న మూడవ తరగతి పెట్టెలో కాళ్ళు బారజాచి కూర్చుంటూ.

అప్పారావు కోటు తడవడం మానేసి కిందనున్న పెట్టెను కొంచెం పక్కకి లాగాడు.

"ఏమండీ మీరు అహోరాత్రాలు రైళ్ళలోనే తిరుగుతూ ఉంటారు. టిక్కెట్టు కొనుక్కుని కూడా రైల్లో బల్ల అడుగున దూరి ప్రయాణం చేసిన ఆసామీ కథ విన్నారా?" అన్నాడు.

"ఎవరండీ. గుర్తులేదే" అన్నాడు టిక్కెట్టు కలెక్టరు సిగరెట్టు ముట్టిస్తూ.

"మహాద్భుతమైన కథలెండి. ఈ లైను లోనే జరిగింది. తెనాలి బెజవాడ స్టేషన్ల మధ్య. ఓ సుబ్బారావూ ఇంకో సింగారం తెనాలినించి బెజవాడ బయలుదేరారు. సుబ్బారావు టిక్కెట్లుకొని, హడావుడిగా ముందు నడుస్తూ ఇదిగో టిక్కెట్లు మీ దగ్గరుంచండి అని సింగారానికి అందించాడు గోచీ సర్దుకుంటూ. ఆదరా బాదరా వెనకాల వస్తున్న సింగారం అందుకుని జేబులో పడేసుకున్నాడు" అని ఆగి, కోటు జేబులో వెతకడం మొదలు పెట్టాడు. "చిత్రంగా ఉందే ఇక్కడ లేదు సుమండీ" అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"సరే కథ చెప్పండి."

"కథకేముంది. సుబ్బారావు అందిచ్చినవి రెండు టిక్కెట్లయితే సింగారం అందుకున్నది ఒక్క టిక్కెట్టే. రైలు బైల్దేరాక వాళ్ళి సంగతి తెలుసు కున్నారు. "రెండూ నీకే ఇచ్చా"నంటాడు సుబ్బారావు. కాదొక్కటే నంటాడు సింగారం. ఇంకోటి కొనడానికి ఇద్దరి దగ్గరాకూడ డబ్బులేదు. "నేనిచ్చిన డబ్బుకి నాకు టిక్కెట్టిచ్చావు. ఆపైన నాకేం తెలీదు" అవటా అనేశాడు సింగారం. "అయితే నన్ను బల్లకింద దూరమంటావా" అన్నాడు సుబ్బారావు టిక్క మొహం పెట్టి. "నాకేం అభ్యంతరంలేదు" అన్నాడు

సింగారం. "అతను మాత్రం ఏంచేస్తాడు చెప్పండి టిక్కెట్టు కలెక్టరు గారూ!" అన్నాడు అప్పారావు.

"మరే మరే. అంతే కదండి. తనకిమాలిన ధర్మం ఏముంది?." అన్నాడు టికెట్ కలెక్టరు.

"సరే,సింగారం బల్లమీద కూర్చున్నాడు. టిక్కెట్టులేని సుబ్బారావు బల్లకింద దూరాడు. అంతలోనే పక్క పెట్లోంచి మీవంటి ఆయనే ఒక టిక్కెట్ కలెక్టరు వచ్చాడు. చాలా మంచివాడు లెండి. అయినా ఈ సంగతి బల్లక్రింద పడుకున్న సుబ్బారావుకి తెలీదుగా. అసలే బల్లక్రింద నారింజ తొక్కలు, పిప్పి, మట్టపీకెలు, బీడీముక్కలూ, పులిహోరలో మిరప కాయలు, ఎంగిలాకులు, వాల్లకాడు, పశనపర్రం మొదలైనవి మోకాల్లోతున ఉన్నాయేమో సుబ్బారావు ఊపిరి సలపక ఉక్కిరిబిక్కిరై పోతున్నాడు."

"పాపం."

"అంతలో 'టికెట్ టికెట్' అనే భయంకరమైన మాటలు వినిపించాయి. టకటకమంటూ బూటు కాళ్ళు కనిపించాయి. సుబ్బారావు గుండె గుభేలుమంది..." అప్పారావు ఆగి, పరీక్షగా చూశాడు.

టికెట్ కలెక్టరు కళ్ళు రెపరెపలాడించి మందహాసం చేశాడు.

"సరే టిక్కెట్ కలెక్టరువచ్చి సింగారాన్ని టిక్కెట్ అడిగాడు. సింగారం బల్లకింద సుబ్బారావుని తలచుకొని కొంచెం కంగారు పడుతూ టికెట్ అందించాడు... అప్పుడేమయింది తెలుసాండి?"

"తెలీదండి"

"ఆ కంగారులో సింగారం అందివ్వబోయిన టిక్కెట్టు చేతిలోంచి జారిపోయింది...... సింగారం వంగిచూస్తే కనబడలేదు. లేచి నుంచుని పంచె కుచ్చిళ్ళు దులిపాడు" అన్నాడు అప్పారావు.

"అప్పుడేమయింది?"

"ఏమవుతుంది. సింగారం టిక్కెట్టుతోపాటు ఇంకో టిక్కెట్టు కూడా కింద పడింది, ఆ రెండోదికూడా మంచిదే. తెనాలిలో సుబ్బారావు అందిచ్చిన రెండు టిక్కెట్లలో అది రెండవదన్నమాట. జారిపడి సింగారం పంచె కుచ్చెళ్ళలో పాదాలమీద ఉన్న మడతలో తలదాచుకుంది"

"చిత్రంగా ఉందే" అన్నాడు టిక్కెట్ కలెక్టర్.

"ఆవేళ రైల్లో ఎక్కిన టిక్కెట్ కలెక్టర్ కూడా అదేమాట అన్నాడండి- రెండు టిక్కెట్లుచూసి రెండో ఆయన ఏడీ?" అడిగాడు... "బల్ల కింద పడుకున్నాడండి. అదో సరదా, అదో రకం ముచ్చటా లెండి" అన్నాడు సింగారం సిగ్గుపడుతూ.

కథ విన్న టికెట్ కలెక్టరు కడుపుబ్బేలా, కణతలు ఎర్రబడేలా కంటనీరు తిరిగేవరకూ నవ్వాడు. నవ్వడం పూర్తి అయిపోయాక "సరే మీ టిక్కెట్ దొరికిందా" అని అడిగాడు గంభీరంగా.

అప్పారావు టికెట్ దొరకలేదు. ముచ్చెమటలు పోశాయి. జేబు రుమాలు తీసి మొహం తుడుచుకోబోయేడు. అందులోంచి ఒక టిక్కెట్టు నేలరాలింది. 'అదిగో' అన్నాడు అప్పారావు వంగి. ఆ వంగినవాడు అర నిమిషం వరకూ లేవలేదు. అర నిమిషం తరవాత నిటారుగా నిలబడి రెండు టిక్కెట్లు చూపించాడు. టిక్కెట్టు కలెక్టరు కళ్ళువిప్పార్చి చూశాడు అప్పారావు వంక.

"రెండోది నా పంచె కుచ్చెళ్ళలో ఉందండి.... మా నేస్తం...."

బల్లకింద పడుకున్న ఆ నేస్తం కింద పడున్న సిగరెట్ పీకతో చురకపెట్టాడు అప్పారావు కాలిమండ దగ్గిర. అప్పారావు కెవ్వుమన్నాడు.